మెడికల్ కాలనీకి సుస్తి

- మురుగు నీరు, దుర్గంధంతో స్థానికుల అవస్థలు
- వర్షాకాలం బురదమయంగా రహదారి
- స్వైర విహారం చేస్తున్న దోమలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన సీసీ రోడ్డు నిర్మాణం



డ్రెయినేజీ వ్యవస్థ లేక రోడ్డు పైకి పారుతున్న మురుగు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ అభివృద్ధి మేడిపండులా తయారైంది. చూడటానికి పైకి బాగా కనిపించినా.. లోన అనేక సమస్యలు ఉన్నాయి. కొన్ని కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోగా.. మరికొన్ని చోట్ల రహదారులు సరిగా లేవు. ఇంకొన్ని చోట్ల రోడ్లను అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. దీని కారణంగా ఆ కాలువలల్లో మురుగు నీరు నిండి రహదారుల గుండా కాలనీల్లోకి వచ్చి చేరుతుంది. దీంతో దుర్గంధం వెదజల్లుతూ ఆ కాలనీ వాసులను ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు.

మెడికల్ కాలనీలలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. అసంపూర్తి డ్రెయినేజీ లైన్లతో ఇక్కడి ఇళ్ల మధ్య మురుగునీరు నిలుస్తోంది. నిలిచిన నీటితో కుంటగా తయారవుతోంది. పాచిపట్టి దుర్గంధం వెదజల్లుతోంది. కనీసం నడవలేని పరిస్థితి. దీనికి తోడు దోమలు బెడదల ఎక్కువైంది. ఏళ్ల గడుస్తున్నా స్థానిక ప్రజలకు ఈ తిప్పలు తప్పడం లేదు. దీనిపై అధికారులను వేడుకున్నా కనికరించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వచ్చిన వర్షా కాలంలో తీవ్ర ఇబ్బందులతోపాటు అనేక మంది రోగాల బారిన పడ్డామని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ వానాకాలంలోనూ ఇదే పరిస్థితి ఉంటే మలేరియా, డెంగ్యూ లాంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ కాలనీలో కొన్ని చోట్ల సీసీ రోడ్లు లేవు. ఒక చోట అసంపూర్తిగా సీసీ రోడ్డు నిర్మించి వదిలేశారు. దీంతో ఆ ప్రదేశంలో ఏర్పాటు చేసిన మోరి వాహనదారులకు ఎంతో ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనదారులు డ్రెయినేజీలో పడే అవకాశం ఉంది.

పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు లేదని స్థానికులు అధికారులను ప్రశిస్తున్నారు. ఇప్పటికైనా దృష్టిపెట్టి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. పారిశుద్ధ్యంపై అవగాహన చర్యలు, నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మురుగు నీరు లేకుండా చూడాలి



ఇళ్ల మధ్యన చాలా కాలంగా నీరు నిలిచి ఉండడంతో దుర్వాసన వస్తోంది. పైగా ఈ మురికి నీటి గుంటలతో నడవలేకపోతున్నాం. కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేకుండా పోయింది. అధికారులు స్పందించి ఇళ్ల మధ్య మురుగు నీరు లేకుండా చర్యలు చేపడితే బాగుంటుంది.

– చీదిరాల వెంకటాచారి, మెడికల్ కాలనీ, భద్రాచలం

అపరిశుభ్రతతో పిల్లలకు రోగాలు



ఇళ్ల మధ్య మురుగు నీరు చేరడంతో దోమల బెడద ఎక్కువైంది. పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. గతేడాది ఇంటిళ్ల పాది ఈ సమస్యను ఎదురుకున్నాం. మురుగు నీల్వ ఉండకుండా మురుగు కాలువల గుండా బయటకు వెళ్లే ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ఏసుదాసు, మెడికల్ కాలనీ, భద్రాచలం

తక్షణమే చర్యలు తీసుకుంటాం..



సమ్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం. రోడ్డు నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులకు దృష్టికి తీసుకెళ్తా. వీలైనంత త్వరగా ఈ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం. నిత్యం అన్ని కాలనీలో పంచాయతీ సిబ్బంది డ్రెయినేజీని శుభ్రం చేస్తున్నారు.

– మిక్కినేని వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ ఈఓ, భద్రాచలం

క్లుప్తంగా

మతోన్మాదం అత్యంత ప్రమాదకరం

చండ్రుగొండ: మతోన్మాదం దేశానికి అత్యంత ప్రమాదకరమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అయన్నపాలెం గ్రామంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల స్థాయి పార్టీ కార్యకర్తలకు ఒకరోజు పాటు రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం-మతోన్మాదం అనే అంశంపై వివరించారు. ఏకత్వంలో భిన్నత్వంగా ఉన్న దేశంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ విచ్ఛిన్ననానికి పాల్పడుతోందని విమర్శించారు. విద్య కాశాయీకరణ దుర్మార్గపు చర్యగా ఆయన అభివర్ణించారు. తన స్వార్థ రాజకీయాలకు కోసం బీజేపీ దేశంలో మతోన్మాదానికి ఊతం ఇస్తుందని ఆరోపించారు. మార్క్సిజం అంటే సైన్స్ అని, అది శాస్త్రీయ అవగాహన కల్పిస్తుందని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, ఐలూరి రామిరెడ్డి పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

మణుగూరురూరల్: ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ.. మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పాడే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో దహనం చేశారు. ఆ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. జర్నలిస్ట్ అయిన అజయ్‌ను ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ముదిరాజ్ కులంతో దూషించడం, దుర్భాషలాడడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే ఎకౌశిక్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ముదిరాజ్ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుండాల: బస్సు కోసం ఎదురుచూస్తున్న యువతులను ఓ ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఆళ్లపల్లి మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన శేఖర్ తన ద్విచక్ర వాహనంపై ఆదివారం ఆళ్లపల్లికి వెళ్తున్నాడు. ఈక్రమంలో తీగలంచ క్రాస్ రోడ్డు వద్ద బస్సుకోసం ఎదురు చూస్తున్న ఇద్దరు యువతులను ద్విచక్రవాహనదారుడు వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఈసం సుజాత అనే యువతికి, వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 ద్వారా ఆళ్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. మండలంలోని శ్రీరంగాపురానికి చెందిన పెనుమత్స వెంకటరామారావు ద్విచక్రవాహనంపై నారంవారిగూడేనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో మార్గమధ్యలోని విజయ దుర్గమ్మ ఆలయం వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. దాంతో వెంకటరామారావు తలకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు గమనించి చిట్టితల్లి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జయప్రదం చేయండి

దమ్మపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ వేతనాలు పెంచాలని కోరుతూ.. ఈ నెల 30వ తేదీన నిర్వహించే చలో హైదారాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల సాంబయ్య మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతన చట్టం అమలు చేసి, పీఎఫ్, ఈఎస్ఐలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తలపెడుతున్న చలో హైదారాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సారిక రాము, యాటల సోమన్న, ముస్తాక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

అశ్వారావుపేటరూరల్: తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, ఈ సమస్యను పరిష్కరించాలని నారాయణపురం మహిళలు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును ఆదివారం విన్నవించారు. మండలంలోని నారాయణపురం ఎస్సీ కాలనీలో జరిగిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరు కాగా.. కాలనీ వాసులు ఎమ్మెల్యేను కలిసి స్థానికంగా తాగు నీటి సమస్య ఉందని, మిషన్ భగీరథ నీళ్లు కూడా సక్రమంగా రావడం లేదని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వినాయకపురం గ్రామం నుంచి ప్రత్యేకంగా పైపులైన్ల నిర్మాణం చేపట్టి, కాలనీకి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అక్కడి నుంచే సంబంధిత అధికారులను ఫోన్ చేసి అంచనా వేసి, ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే రెండు సీసీ రోడ్లు నిర్మించామని, మరో సీసీ రోడ్లు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో వారంతా హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కంగాల పరమేష్, జెడ్పీటీసీ సభ్యురాలు సీహెచ్ వరలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవేంద్రరావు

మణుగూరురూరల్: మణుగూరులోని మౌనికా రెస్టారెంట్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా గాజుల పూర్ణచందర్‌రావు, కార్యదర్శిగా ఎస్‌కె.మీరాహుస్సేన్, కోశాధికారిగా అడబాల నాగేశ్వరరావులు ఎన్నిక కాగా.. క్లబ్ పాస్ట్ గవర్నర్‌లు కాపా మురళీకృష్ణ, ధార కృష్ణారావులు వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు హాజరై మాట్లాడారు. మణుగూరు మండల వ్యాప్తంగా లయన్స్ క్లబ్ వారు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. నిరుపేదలకు, బాధితులకు క్లబ్ వారు అందిస్తున్న సహయ సహకారాలు ఎంతో ప్రశంసనీయమన్నారు. నూతన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం క్లబ్ నూతన అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్‌రావు–నాగేశ్వరి దంపతుల షష్టిపూర్తి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రోగ్రామ్ చైర్మన్ గాజుల రమేష్‌కుమార్, కె.చంద్రమోహన్, ముత్తంశెట్టి నాగేశ్వరరావు, దోసపాటి వెంకటేశ్వరరావు, బేతంచర్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ దుస్సా సమ్మయ్య, బొలిశెట్టి ఆనందభాస్కర్, వన్నం కృష్ణమోహన్, దుగ్గి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ దాడులను ఖండించాలి



బూర్గంపాడు: సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణ

బూర్గంపాడు: అశ్వారావుపేట బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మడకం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నాయకుల దాడులను ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. ఆదివారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఎస్పీ ఆధ్వర్యంలో అశ్వారావుపేట మండలం మల్లాయిగూడెంలో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ మడకం ప్రసాద్, ఇతర నాయకులపై స్థానిక బీఆర్ఎస్ సర్పంచ్ నారం శేఖర్, అతని అనుచరులు భౌతికదాడులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు పలక ఆదిలక్ష్మి, గాడిద దామోదర్, ఇల్లందుల శేషు, సాడే వీరస్వామి, కొప్పుల రాంబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: అశ్వారావుపేట నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి మడకం ప్రసాద్ దౌర్జపై బీఆర్ఎస్ సర్పంచ్, అతని అనుచరులు కలసి దాడి చేసినట్లు, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఎస్పీ నాయకుడు కనుకుసాగర్ తెలిపారు. ఆదివారం నర్సాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌ను విధుల నుంచి తొలగించి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు కొప్పుల రాంబాబు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పాడుతూరి రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఆషాఢ బోనాల సందడి



అశ్వారావుపేటరూరల్: బోనమెత్తి మహిళలతో ప్రదర్శనగా వస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్: ఆషాఢమాసం సందర్భంగా ఆలయాల్లో ఆదివారం బోనాల సందడి నెలకొంది. మండలంలోని గుర్రాల చెరువు, నారాయణపురం గ్రామ శివారుల్లోని కనకదుర్గ అమ్మవారి ఆలయం, కట్ట మైసమ్మ తల్లి ఆలయాల్లో మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, యువతులు బోనాలను తలపై పెట్టుకొని మేళ తాళాలతో ఆలయాల వద్దకు ప్రదర్శనగా వచ్చి, అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. అనంతరం భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలోని భక్తులతో ఆలయాల వద్ద సందడిగా మారింది.

బోనమెత్తిన ఎమ్మెల్యే..

మండలంలోని గుర్రాలచెరువు, నారాయణపురం గ్రామాల్లో ఆదివారం జరిగిన ఆషాడ బోనాల ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యేకు భక్తులు, అలయ కమిటీ బాధ్యులు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత ఎమ్మెల్యే బోనాన్ని తలపై ఎత్తుకొని ఆలయాల వద్ద ప్రదర్శనలు చేసి, అమ్మవార్లకు సమర్పించారు. పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కలపాల దుర్గయ్య, కంగాల పరమేష్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు సీహెచ్ వరలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్ రెడ్డి, సంపూర్ణ, సీహెచ్ వెంకట నరసింహం, ఆకుల శ్రీను, నులకాని శ్రీను పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన బసవ వెంకన్న ఇటీవల మృతి చెందాడు. 2004–05 సంవత్సరంలో చదువుకున్న మృతుని మిత్ర బృందం రూ.20 వేలు ఆదివారం మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందించారు. కష్టాల్లో ఉన్న స్నేహితుని కుటుంబానికి వారు చేయూతను అందించినట్లైంది.

బీజేపీ ప్రచారం

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం, కట్టుమల్లారం గ్రామపంచాయతీల్లో దేశంలో ప్రధాని మోదీ పాలన, అమలు చేస్తున్న పథకాలపై బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు కరపత్రాలతో విస్తృత ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ.. తొమ్మిదేండ్ల పాలనలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రధాని మోదీ పాలన గురించి, అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు, మండల అధ్యక్షుడు కుంజా రామకృష్ణ, నాయకులు కిషోర్, బిక్షపతి, రామకృష్ణంరాజు, నాగశేషు, మురళీమోహన్‌రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు అందించండి

గుండాల: రాష్ట్ర ప్రభుత్వం అందించే బీసీ రుణాలను పద్మశాలీ కుటుంబాలకు సైతం వర్తింపజేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల రామచంద్రరావు, కార్యదర్శి మంచుకట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు పోలు కనకయ్య ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు శాశ్వత సభ్యత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎలగందుల రాజేశ్వరావు, జిల్లా ఉపాధ్యాక్షుడు సింగం చిన రాజేశ్వరావు, రాములు, వెంగళ సాంబయ్య, వేముల కోటయ్య, మార్తా రామకృష్ణ, దేవసాని సదయ్య, రాచకొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక దాడిని ఖండించండి

గుండాల: స్వతంత్ర జర్నలిస్ట్ తులసీ చందుపై యూట్యూబ్‌లో జరుగుతున్న మానసిక దాడిని వ్యతిరేకించాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి వాంకుడోత్ అజయ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమానత్వం కోసం గొంతు విప్పే ధైర్యవంతురాలిగా తులసీ చందును అభివర్ణించారు. ఇలాంటి ఈమెపై మనువాదపు భావాజాలంతో అభివృద్ధి నిరోధక ఆర్ఎస్ఎస్, బీజేపీ మూకలు భూత రాతలతో వేధిస్తున్నాయని విమర్శించారు. తులసీ చందు ధైర్యంగా నిలబడాలని, సమాజం, ప్రజాస్వామిక వాదులు అండగా ఉంటారని తెలిపారు. జిల్లా నాయకులు ఈసం క్రిష్ణ, సనప కుమార్, పూనెం మంగయ్య, కోడూరి జగన్, మోహన్, సురేష్, కృష్ణ, నరేష్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తాగునీటి సమస్య



కారులో మంచినీరు తీసుకొస్తున్న ప్రిన్సిపాల్ సత్యప్రకాష్, అధ్యాపకుడు

అశ్వాపురం: 250 మంది విద్యార్థులు చదువుతున్న మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీసం విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేదు. ప్రిన్సిపల్ సత్యప్రకాష్, అధ్యాపకులు మినరల్ వాటర్ రెండు రోజులకొకసారి కారులో తీసుకొస్తున్నారు. ఆ నీటితోనే విద్యార్థులు దాహం తీర్చుకుంటున్నారు. కళాశాలలో తాగునీటి సమస్య ఎంతో కాలంగా ఉన్నప్పటికీ.. పరిష్కరించాల్సిందిగా విద్యార్థులు, సిబ్బంది నిత్యం కోరుతున్నప్పటికీ పట్టించుకున్నవారు లేరు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని వారు కోరుతున్నారు. మరోవైపు ఇదే కళాశాలలో మరుగుదొడ్లు శిథిలావస్థలో ఉండగా.. ప్రిన్సిపల్ విన్నపం మేరకు మణుగూరు భార జల కర్మాగారం ఆధ్వర్యంలో రూ.3 లక్షలతో మరమ్మతులు చేయించారు.

సమాజ సేవకులకు సన్మానం



మణుగూరురూరల్: మాజీ సైనికులను సన్మానిస్తున్న వాసవిక్లబ్ సభ్యులు

మణుగూరురూరల్: వాసవిక్లబ్, వాసవి వనితా వైభవ్ క్లబ్ మణుగూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం డాన్‌టూ డస్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న రైతులు, సైనికులు, మాజీ సైనికులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు పేద ప్రజలకు వస్త్రాలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ఐఈసీ ఆఫీసర్ బండారు వెంకటేశ్వర్లు, ఐపీసీ ఆఫీసర్ ఎం .మల్లేశ్వరరావు, దోసపాటి నాగేశ్వరరావు, ఆర్‌సీ చిత్తలూరి ఉమా రమేష్, జెడ్‌సీ డి.బ్రహ్మయ్య, అధ్యక్షుడు చిత్తూరి శేషు, ల్యాబ్ నరసింహారావు, మాజీ సైనికులు మంగి మల్లికార్జున్, జగదీష్, రైతులు చిన్ని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: వాసవి క్లబ్ సారపాక, వనిత సారపాక ఆధ్వర్యంలో డాన్ టూ డస్క్ నినాదంతో ఆదివారం సారపాకలో రైతులు, సైనికులను సన్మానించారు. సారపాకలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు నారపరెడ్డి, రైతు వెంకటేశ్వర్లుతో పాటు పలువురిని ఘనంగా సన్మానించారు. దేశం కోసం అనునిత్యం శ్రమిస్తున్న సైనికులను, రైతులను సన్మానించుకోవటం మన బాధ్యతని వాసవి క్లబ్ ఐఈసీ ఆఫీసర్ బండారు వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు మంకల మల్లేశ్వర్, చిత్తలూరు రమేష్, సీహెచ్ ఉమ, కంచర్ల వీరభద్రరావు, కేతేపల్లి భవాని, బచ్చు సతీష్, పచ్చిపులుసు లక్ష్మీతేజ, కేదారిశెట్టి సోమేశ్వరరావు,కంటాల సింధు, పచ్చిపులుసు వెంకటసుబ్బారావు, కేతేపల్లి ప్రవీణ్, రేపాక రాజ్యలక్ష్మి, వనమా వాసవి, గోకవరపు భవాని, శీకాకొల్లి సునంద, గుంటుపల్లి స్వప్న, బిందు మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వితరణ



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సీతమ్మ

దుమ్ముగూడెం: మండలంలోని పెద్ద బండిరేవు గ్రామంలో విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన బాధిత సోయం రాజమ్మ కుటుంబానికి జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ ఆదివారం వితరణ అందజేశారు. అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని బాధిత కుటుంబానికి ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావ్ ఆర్థిక సహాయంతో బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, తోట రమేష్, వెంకనరాజు, కొమ్ము, రంజిత్, భూపతి, ముత్యాలు, చింతం సమ్మయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపు కేసులు సరికాదు

అశ్వాపురం: మండలంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయించడం అన్యాయమని ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. అశ్వాపురంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 35 సంవత్సరాలుగా రాజకీయ అనుభవం ఉన్న తుళ్లూరి బ్రహ్మయ్యపై ఆయన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక బీఆర్ఎస్ ప్రభుత్వం పొంగులేటి అనుచరులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. కేసులు ఎత్తి వేయకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

జెన్‌కో సీఎండీకి వినతి

మణుగూరురూరల్: మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు షిఫ్ట్ అలవెన్సులు మంజూరు చేయాలని కోరుతూ టీఎస్‌పీఈయూ–1535 ఆధ్వర్యంలో టీఎస్ జెన్‌కో సీఅండ్ ఎండీ ప్రభాకర్‌రావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. తొలుత బీటీపీఎస్ సందర్శనకు వచ్చిన సీఎండీకి యూనియన్ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి డి.రాధాకృష్ణ, అదనపు కార్యదర్శి ఎం .శ్రీధర్, బీటీపీఎస్ రీజియన్ అధ్యక్షుడు వి.ప్రసాద్‌లు పూలమొక్క అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు పలు సమస్యలను జెన్‌కో సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగులకు షిఫ్ట్ అలవెన్సులు, శాంక్షన్ పోస్టులు మంజూరు చేయాలని, డిపార్ట్ మెంటల్ పదోన్నతుల కమిటీని నియమించి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగ నియామక సమయంలో విద్యార్హత తప్పుగా నమోదైన కొందరి భూనిర్వాసితుల వివరాలను సవరించి, అందుకు అనుగుణంగా తగిన ఉద్యోగాన్ని కల్పించాలని కోరారు. సమస్యలపై జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఐతరాజు వెంకటేశ్వర్లు, సిద్దుల హుస్సేన్, రత్నాకర్, పుల్లారావు, ఆర్.రామచందర్, టి.అనిల్, ఆర్.రవిచంద్ర, మహిళా నాయకురాళ్లు సునీత, రమాదేవి, జానిబేగం తదితరులు పాల్గొన్నారు.

పోడుపట్టాలు ఇవ్వాలని ఆందోళన



దుమ్ముగూడెం: పోడు పట్టాల కోసం నిరసన తెలియచేస్తున్న రైతులు

దుమ్ముగూడెం: మండలంలో పోడుసాగుదారులందరకీ పట్టాలివ్వడంలో ఆలస్యం చేస్తున్న ప్రభుత్వ తీరుపై సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో నిరసన ఆదివారం తెలియజేశారు. మండలంలోని లచ్చిగూడెం, అడవి రామవరం, పెద్దార్లగూడెం పోడు రైతులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి సాయన్న, రైతు సంఘం భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సున్న వీరభద్రం మాట్లాడుతూ.. జూన్ 24న పోడు భూములకు పట్టాలు ఇస్తానన్న కేసీఆర్ వాయిదా వేసి మాట తప్పాడని అన్నారు. పట్టాల పంపిణీ తర్వాతనే ఎన్నికల ప్రక్రియలోకి వెళ్లాలని, లేదంటే ప్రజలు, ప్రజాస్వామిక వాదులు బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో మిడియం శంకర్, సునీత, ముదిరాజు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: సాగులో పోడు భూములకు, అర్హత ఉన్న వారికి పోడు హక్కు పత్రాలు ఇవ్వాలని ఏఐకేఎంఎస్ సంఘం రాష్ట్ర నాయకుడు కెచ్చల రంగారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..హక్కు పత్రాల కోసం చేసుకున్న దరఖాస్తులను అధిక సంఖ్యలో తిరస్కరించారని, వాటిని పునఃపరిశీలన చేయాలని కోరారు. పోడు పట్టాల జాబితాలో దమ్మపేట మండలంలోని మెండివర్రె, నాగుపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 1000 ఎకరాలకు సంబంధించిన గిరిజనుల పేర్లు లేకుండా చేశారని, ఇది తగదన్నారు. పోడు సాగు దారులపై పెట్టిన పోలీస్, అటవీ కేసులు తక్షణమే ఎత్తివేయాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పోడు పట్టాలు ఇవ్వాలని లేని పక్షంలో ప్రత్యేక్ష ఆందోళనకు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గోగినపల్లి ప్రభాకర్, లక్ష్మి ఉన్నారు.

పోడు రైతులందరికీ పట్టాలివ్వాలి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలోని పోడురైతులందరికీ బిఆర్ఎస్ ప్రభుత్వం పోడు హక్కు పట్టాలు ఇవ్వాలని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30న అర్హులైన పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టాలను పోడు సాగు దారులకు పారదర్శకంగా పంపిణీ చేయాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు తప్పవన్నారు. సమావేశంలో నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, గద్దల శ్రీనివాసరావు, పాయం నరసింహరావు, టీపీఎంపీ ప్రసాద్, సత్రపల్లి సాంబశివరావు, నరసింహరావు, పద్మ, నాగమణి, నాగలక్ష్మి, ఉత్తమ్, రాజు తదితరులు పాల్గొన్నారు.